నేడు ఉచిత వైద్య శిబిరం

రామంతాపూర్: సీనియర్ సిటిజన్ సంఘం లయన్స్ క్లబ్ ఆఫ్ సంస్కృతి ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్షులు సత్తిరాజు కపిర్తేశ్వర్‌రావు, ఉపాధ్యక్షులు వెంకట్‌రెడ్డి శనివారం తెలిపారు. స్థానిక గోకుల్‌నగర్‌లోని బాల భారతి పాఠశాలలో వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ శిబిరంలో కన్ను, పన్ను, షుగర్, బిపి, ఎముకల ప్రముఖ వైద్య నిపుణులచే పరీక్షలు నిర్వహించి ఉచిత మందులు పంపిణీ చేస్తారని తెలిపారు. వివరాలకు 9849772921 సంప్రదించాలన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి



ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్ మల్లికార్జున నగర్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని శనివారం కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. కాలనీలో రోడ్లు, డ్రైనేజీ, ఇతర మౌలిక వసతులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మేకల రాముయాదవ్, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎస్పీనగర్‌లో కార్పొరేటర్ పర్యటన



సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ సునీతా యాదవ్

మౌలాలి: మౌలాలి డివిజన్ పరిధిలోని ఎస్పీనగర్ కాలనీలో శనివారం కార్పొరేటర్ సునీతా శేఖర్ యాదవ్ పర్యటించారు. ఇంటింటికీ తిరిగి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ.. డ్రైనేజీ సమస్యను ఎప్పటికప్పుడూ పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఏఈ మధురిమ, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేంద్ర, సివరేజ్ సూపర్‌వైజర్ శివ, వాటర్ వర్క్స్ సూపర్‌వైజర్ సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని అల్వాల్‌కు తరలించాలి



ఎంపీ ఈటల రాజేందర్‌కి వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

అల్వాల్ : అల్వాల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని అల్వాల్‌లో ఏర్పాటు చేయాలని బీజేపీ నాయకులు శనివారం మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌కు వినతిపత్రం అందజేశారు. అల్వాల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం బేగంపేట్‌లోని వల్లభ్‌నగర్‌లో ఉండటం వల్ల అల్వాల్, మచ్చబొల్లారం, వెంకటాపురం డివిజన్లకు చెందిన భూముల రిజిస్ట్రేషన్ల కోసం ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని, తక్షణమే తగు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో డి.వెంకటేష్, మల్లికార్జున్‌యాదవ్, సుజాత, పద్మిని, పర్వతాలు, ఆనంద్, అజిత్‌సాయి, ప్రదీప్, నాగేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పదవీ విరమణ సత్కారం



అల్వాల్: అల్వాల్ మున్సిపాలిటీలో 27 సంవత్సరాలు ఉద్యోగం చేసి పదవీ విరమణ పొందిన పద్మను శనివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అల్వాల్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడారు. ఆమె చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ఏఎంసీ నర్సింహారెడ్డి, లలిత్‌కుమార్, డాక్టర్ మంజుల, పద్మ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

అల్వాల్: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మెదక్ జిల్లాకు చెందిన సతీష్‌రెడ్డి (25) అల్వాల్ వెంకటరావు పేటలో నివాసం ఉంటున్నాడు. బోయిన్‌పల్లిలోని సిమెంట్ షాప్‌లో పని చేస్తున్నాడు. శనివారం మధ్యాహ్నం ఇంటికి వచ్చి ద్విచక్ర వాహనంపై తిరిగి వెళ్తున్నాడు. ఈ క్రమంలో కానాజీగూడ డెయిరీ ఫార్మ్ రోడ్డు వద్ద ఎదురుగా వచ్చిన కారు ఢీ కొట్టడంతో కింద పడ్డాడు. వెనుక నుంచి బస్సు రావడంతో బస్ ఢీకొని తీవ్ర గాయాలయ్యాయి. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



ఉప్పల్ : ఉప్పల్ మినీ శిల్పారామంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా శనివారం నిర్వహించిన పలు కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. శివరంజనీ కళానిలయం గురువు సంగీత రామకృష్ణ శిష్యబృందంచే నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన అలరించింది. రంగపూజ, గణేషా కౌతం, దశావతార శబ్దం, రామాయణ శబ్దం, తిల్లాన అంశాలను అక్షయ, శాన్వి, వర్షిణి, మహాలక్ష్మి, హరిత, హిమ తదితరులు ప్రదర్శించి మెప్పించారు. డా. సుధాకర్, శ్రీలత ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

నిధులు సరే.. నిర్మాణమేదీ?

ఇందిరానెహ్రూనగర్‌లో నిరుపయోగంగా కమ్యూనిటీహాల్ స్థలం

- ఇబ్బందులు పడుతున్న కాలనీ ప్రజలు
- సంవత్సరాలు గడుస్తున్నా నిర్మాణానికి నోచుకోని వైనం



ఇందిరానెహ్రూనగర్‌లో నిరుపయోగంగా ఉన్న కమ్యూనిటీ హాల్ స్థలం

గౌతంనగర్ : ఇందిరానెహ్రూనగర్‌లో కమ్యూనిటీహాల్ నిర్మాణం కోసం కేటాయించిన 80 గజాల స్థలం నిరుపయోగంగా ఉంటుంది. నిధులు మంజూరైన దశాబ్దకాలంగా కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నోచుకోవడం లేదని కాలనీ ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ఇందిరానెహ్రూనగర్ కాలనీకి ఈ 80 గజాల స్థలంలో అప్పటి ప్రభుత్వ మరుగుదొడ్లు ఉండేవి. మరుగుదొడ్లు అంతరించి పోవడంతో అదే స్థలాన్ని కాలనీకి ఉపయోగపడడానికి 2006 సంవత్సరంలో అప్పటి కంటోన్మెంట్ ఎమ్మెల్యే సాయన్న హయాంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపారు. అనంతరం 2009లో కంటోన్మెంట్ నియోజకవర్గంలో ఉన్న మల్కాజిగిరి ప్రత్యేక నియోజకవర్గంగా ఏర్పడింది. 2009 నుంచి ఎమ్మెల్యేగా ఉన్న ఆకుల రాజేందర్ ఇందిరమ్మ బాట కార్యక్రమంలో భాగంగా 2013లో కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం నిధులు మంజూరు చేసి నిర్మాణం కోసం శంకుస్థాపన చేశారు. అయినా కమ్యూనిటీహాల్ నిర్మాణానికి నోచుకోలేదని కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అనంతరం తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత టీఆర్ఎస్ పాలనలో అప్పటి ఎమ్మెల్యే చింతల కనకారెడ్డి సైతం కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అయినా కూడా కమ్యూనిటీహాల్ నిర్మాణం జరగలేదని కాలనీ వాసులు తెలిపారు. కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రెండు సార్లు మొత్తం కలిపి రూ. 35 లక్షలు నిధులు మంజూరైనప్పటికీ నిర్మాణం జరుగకపోవడం దారుణమని పలువురు కాలనీ వాసులు పేర్కొన్నారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి ఇందిరానెహ్రూనగర్‌లో నిరూపయోగంగా ఉన్న స్థలంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే, కార్పొరేటర్



మల్లాపూర్: మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్‌ను శనివారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం మల్లాపూర్ సూర్యనగర్ కాలనీలోని ప్రాథమిక పట్టణ ఆరోగ్య కేంద్రంలో మౌలిక వసతులు, జిల్లా పరిషత్ హైస్కూల్‌పలు అభివృద్ధి పనుల కోసం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, ప్రవీణ్, నేమూరి మహేశ్‌గౌడ్ తదితరులున్నారు.

మూసీనది బఫర్‌జోన్‌ను అధికారుల పరిశీలన

రామంతాపూర్: మేడ్చల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని మూసీ రివర్స్ ఫంట్ డిప్యూటీ కలెక్టర్ మాలతి, తహసీల్దార్ రాధిక, ఉప్పల్ సర్కిల్ డీసీ ఆంజనేయులు శనివారం రామంతాపూర్ మూసీనది బఫర్ జోన్‌ను పరిశీలించారు. బఫర్ జోన్ పరిధిలో ఎన్ని గృహాలు ఉన్నాయి తదితర విషయాలను గుర్తించారు.

ఆస్పత్రిలో మెరుగైన సేవలందించాలి



ఆస్పత్రిలో సర్వే చేస్తున్న ఐద్వా నాయకురాళ్లు

మల్కాజిగిరి: మల్కాజిగిరిలోని ప్రభుత్వ జిల్లా కేంద్రం ఆస్పత్రిలో మెరుగైన వైద్య సేవలందించాలని ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి వినోద డిమాండ్ చేశారు. శనివారం మల్కాజిగిరి ఐద్వా కమిటీ ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వైద్యం కోసం ప్రభుత్వాలు లక్షల రూపాయలు ఖర్చు చేస్తున్నాయన్న మాటలు వాస్తవ రూపంలో కనిపించడం లేదన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వసతులు కల్పిస్తే.. ప్రజలు దూరంగా ఉన్న ఆస్పత్రులకు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. జిల్లా కేంద్రం ఆస్పత్రిలో కూడా వసతులు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఐద్వా మండల అధ్యక్ష, కార్యదర్శులు నాగమణి, మంగ, నాయకులు రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

డీఎస్‌కు నివాళులర్పించిన మాజీ మేయర్ దంపతులు



డీఎస్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మేయర్ రాంమోహన్ దంపతులు

కుషాయిగూడ: పీసీసీ మాజీ అధ్యక్షుడు ధర్మపురి శ్రీనివాస్ మృతి పట్ల గ్రేటర్ మాజీ మేయర్ బొంతు రాంమోహన్, శ్రీదేవి దంపతులు సంతాపం తెలిపారు. డీఎస్ మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని అన్నారు.

సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తా



కోదండరాంకి వినతిపత్రం అందజేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు

మౌలాలి: ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకువెళ్తానని టీజేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. శనివారం వినాయకనగర్ డివిజన్ ఎస్ఎస్ గార్డెన్‌లో ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమ్మేళన సమావేశం జరిగింది. సమావేశానికి కోదండరాం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వివిధ సమస్యలు పరిష్కరించాలని ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఆయనకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వెంకట్, సంజీవ, రాము, శ్రీనివాస్, కంప్యూటర్ ఆపరేటర్స్, ఏఎఫ్ఏలు వర్క్ ఇన్‌స్పెక్టర్లు, ట్రాన్స్‌పోర్ట్, ఎలక్ట్రికల్ వింగ్, హార్టికల్చర్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



జలమండలి ఎండీకి వినతిపత్రం అందచేస్తున్న కార్పొరేటర్ చేతన

హబ్సిగూడ: హబ్సిగూడ డివిజన్ పరిధిలో నెలకొన్న వివిధ సమస్యలను పరిష్కరించాలని కార్పొరేటర్ కక్కిరేని చేతనహరీష్ శనివారం జలమండలి ఎండీకి వినతిపత్రం అందజేశారు. పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు.

డ్రైనేజీ పనులను వెంటనే పూర్తి చేయాలి



డ్రైనేజీని పరిశీలిస్తున్న కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్, అధికారులు

మల్లాపూర్: నాచారం ఓల్డ్ విలేజ్, కుమ్మరి బస్తీలో డ్రైనేజీ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని నాచారం కార్పొరేటర్ శాంతి సాయి జెన్‌శేఖర్ అన్నారు. శనివారం జలమండలి అధికారులతో కలిసి పర్యటించారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ.. డ్రైనేజీ నిర్మాణ పనులు దాదాపుగా పూర్తి కావచ్చాయని, మిగిలిన పనులను కూడా సకాలంలో పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో జలమండలి డీజీఎం సతీష్ కుమార్, మేనేజర్ వేణుగోపాల్, బీఆర్ఎస్ నేతలు నమలికొండ భూపాల్ రెడ్డి, రమణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కట్ట బుచ్చన్నగౌడ్, భరత్, రాంజీ, సాయిజెన్ శేఖర్, కాంట్రాక్టర్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ లైన్ ఏర్పాటు చేయాలని ..

మల్లాపూర్: మల్లాపూర్ డివిజన్ పరిధిలోని ఈస్ట్ అన్నపూర్ణ కాలనీలో వీధి నంబర్ -3 తదితర రోడ్డు నంబర్‌లలో పెద్ద డ్రైనేజీ లైన్‌లను వేయాలని కోరుతూ శనివారం జలమండలి ఎండీకి కాలనీ సలహా దారులు శ్రీకాంత్ రెడ్డి వినతి పత్రం అందజేశారు. దీనికి ఎండీ సానుకూలంగా స్పందించారని ఆయన తెలిపారు.

బోరు మరమ్మతులెప్పుడో?

గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్ పరిధిలోని ఇందిరానెహ్రూనగర్‌లో గత కొంతకాలంగా పవర్ బోరు పాడైపోయింది. బోరుకు మరమ్మతులు చేస్తామని బోరు లోపల ఉన్న పైపులు కూడా తీసి బయట వేశారు. కానీ కాలం గడుస్తున్నా పవర్ బోర్ మరమ్మతులకు నోచుకోవడం లేదు. దీంతో కాలనీవాసులు పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పవర్ బోరు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.



బయటకు తీసిన పైపులు


మురుగు సమస్యను పరిష్కరించాలి



మురుగునీటి గుంటను పరిశీలిస్తున్న కార్పొరేటర్ స్వర్ణరాజ్

కుషాయిగూడ : కాప్రా డివిజన్ గౌరినాథపురంలో డ్రైనేజీ అవుట్‌లెట్‌ను ఏర్పాటు చేసి మురుగు సమస్యను పరిష్కరించాలని కార్పొరేటర్ స్వర్ణ రాజ్ అధికారులకు సూచించారు. కాలనీలో డ్రైనేజీ అవుట్‌లెట్ లేక నిలిచిన మురికి గుంటను శనివారం వాటర్‌వర్క్స్ అధికారులతో కలిసి పరిశీలించారు. చెరువును తలపించేలా మారిన మురుగు నీటితో కాలనీ వాసులు పడుతున్న బాధను అధికారులకు వివరించారు. ముఖ్యంగా మురుగునీరు భూమిలో ఇంకి కాలనీలోని బోర్లలోకి ప్రవేశించి అనారోగ్యం బారిన పడుతున్నారన్నారు. అవుట్‌లెట్ నిర్మాణానికి కావాల్సిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు.

వ్యక్తి అదృశ్యం



ఇర్ఫాన్ (ఫైల్)

అల్వాల్ : వ్యక్తి అదృశ్యమైన సంఘటన నేరేడ్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్‌కు చెందిన ఎండి.ఇర్ఫాన్ (27) ఉద్యోగ వేటలో ఉన్నాడు. ముంబైకి వెళ్లి అక్కడ జీతం తక్కువ రావడంతో ఈ నెల 3వ తేదీన నగరానికి వచ్చి సైనిక్‌పురిలోని తన స్నేహితుడు కష్యప్ వద్ద ఉంటున్నాడు. 14వ తేదీన భార్య మోబిన్ ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. తన స్నేహితుడికి చేయగా 15వ తేదీన తన స్నేహితులు అనిల్, కష్యప్, నిఖిల్, వసీమ్‌లతో కలిసి మొయినాబాద్ ఫార్మ్‌హౌస్‌కు వెళ్లి పార్టీ చేసుకొని మరుసటి రోజు ఉదయం నేరేడ్‌మెట్‌లో వదిలి వెళ్లిపోయామన్నారు. ఎంత వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నియోజకవర్గంలో మౌలిక వసతులు కల్పించాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

కుషాయిగూడ : ఉప్పల్ నియోజకవర్గంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన మౌలిక వసతులు కల్పించాలని శనివారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కలెక్టర్ గౌతమ్‌కు వినతిపత్రం అందజేశారు. ఏఎస్‌రావునగర్ బస్తీ దవాఖానలో శాంపిల్స్ సేకరణ కోసం అదనపు గది నిర్మాణం చేయాలని, మహేశ్‌నగర్‌లో అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించేలా చూడాలని కలెక్టర్‌ను కోరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేదలకు నాణ్యమైన, మెరుగైన వైద్యం చేరువవ్వాలనే సంకల్పంతో నాడు బీఆర్ఎస్ ప్రభుత్వం బస్తీ దవాఖానలను ఏర్పాటు చేసిందన్నారు. కార్యక్రమంలో మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, కాసం మహిపాల్‌రెడ్డి, నేమూరి మహేశ్‌గౌడ్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

శానిటేషన్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి



చర్లపల్లి చెరువును పరిశీలిస్తున్న జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్

కుషాయిగూడ : వర్షకాలం దృష్ట్యా శానిటేషన్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ ఐఏఎస్ సూచించారు. శానిటేషన్ డ్రైవ్‌లో భాగంగా శనివారం ఆయన కాప్రా సర్కిల్ పరిధిలోని చర్లపల్లి, కాప్రా చెరువులను పరిశీలించారు. నీరు ఎక్కడి నుంచి వస్తుంది, చెరువుల్లోకి వర్షం నీరు చేరుతుందా, డ్రైనేజీ నీరు వస్తుందా, ఎంత మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారనే తదితర విషయాల గురించి తెలుసుకున్నారు. గుర్రపుడెక్క సమస్య లేకుండా చూసుకోవాలన్నారు. ఎక్కడ కూడా నీరు నిలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నాలాల్లో పూడిక తీత, బకెట్ క్లీనింగ్ పనుల పురోగతిపై ఇంజినీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. కాప్రా చెరువు వద్ద వాకింగ్ ట్రాక్ బాగుందన్నారు. కార్యక్రమంలో కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ముకుంద్‌రెడ్డి, ఇంజినీరింగ్ ఈఈ హరిలాల్, ఏఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ, ఎలక్ట్రికల్ డీఈ రవీందర్ పాల్గొన్నారు.

బీఎల్ఆర్ సేవలు అభినందనీయం



కేసీఆర్ చేతుల మీదుగా మెడిసిన్ విద్యార్థికి ఆర్థికసాయం అందజేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

కుషాయిగూడ: పేద విద్యార్థులకు ఆర్థికసాయం అందజేస్తున్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సేవలు అభినందనీయమని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. కుషాయిగూడకు చెందిన అమర్‌నాథ్ అనే పేద విద్యార్థి ఎల్‌బీనగర్ కామినేనిలో మెడికల్ సీటు సాధించాడు. అతడికి తల్లిదండ్రులు లేక పోవడం, మెడిసిన్ చదువుకునే ఆర్థిక స్తోమత లేని పరిస్థితులు తెలిసిన బీఎల్ఆర్ తన ట్రస్టు ద్వారా అమర్‌నాథ్‌కు మెడిసిన్ చదువుకోవడానికి అవసరమైన ఆర్థికసాయం అందజేసేందుకు ముందుకు వచ్చాడు. అందుకు సంబంధించి ఆర్థికసాయాన్ని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల మీదుగా అమర్‌నాథ్‌కు అందజేశారు. కార్యక్రమంలో నేమూరి మహేశ్‌గౌడ్, పాండాల శివకుమార్‌గౌడ్, నారెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నియామకం



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ ఆర్ట్స్ కాలేజీకి ఇన్‌చార్జి ప్రిన్సిపల్‌గా అరబిక్ డిపార్టుమెంట్ అధ్యాపకురాలు ప్రొ.సయ్యద్ తలత్ సుల్తానా నియమితులయ్యారు. ప్రస్తుత ప్రిన్సిపల్ ప్రొ.అర్జున్‌రావు ఉద్యోగ విరమణతో ఆమెను నియమించారు.

పేపర్ లీకేజీ కారకులపై చర్యలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న సత్యప్రసాద్

బోడుప్పల్: నీట్ పరీక్ష పేపర్‌ను లీక్ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు సత్యప్రసాద్ డిమాండ్ చేశారు. బోడుప్పల్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పరీక్ష పేపర్ లీక్ అవ్వడంతో ఎంతో మంది పేద, మధ్యతరగతి విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. నీట్ పరీక్ష లీకేజీపై సమగ్రమైన దర్యాప్తు జరపాలన్నారు. సమావేశంలో ఏఐవైఎఫ్ మేడిపల్లి అధ్యక్షులు మణిదీప్, కార్యదర్శి నాగరాజు, నేతలు ప్రీతమ్, రాజేష్, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో ముందుండాలి

బోడుప్పల్ : విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో ముందుండాలని లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్ చైర్మన్ కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డి అన్నారు. బోడుప్పల్‌లోని పాఠశాలలో శనివారం నిర్వహించిన ఫుడ్‌ఫెస్ట్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు ఫుడ్‌ఫెస్ట్‌లో పాల్గొని తమదైన శైలిలో ఆహారాన్ని తయారు చేశారన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ నాగలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



రోడ్డు తవ్వారు...వేయడం మరిచారు



గౌతంనగర్ : గౌతంనగర్ డివిజన్ అన్నపూర్ణ సొసైటీలో సీసీ రోడ్డు అభివృద్ధికి నోచుకోక అధ్వానంగా తయారయ్యాయి. కొన్ని రోజుల క్రితం భూగర్భ డ్రైనేజీ కోసం అధికారులు తవ్వారు. పనులు పూర్తైనప్పటికీ రోడ్లు వేయడం మరిచారు. కొంత కాలంగా రోడ్లు అధ్వానంగా ఉండటంతో రాకపోకలు సాగించాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలనీలో అధ్వానంగా రోడ్లను వేయాలని కోరుతున్నారు.